క్లుప్తంగా

ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల సమస్యలను ఎమ్మెల్యే పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు.

నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పర్యటన

జమ్మలమడుగు : మండలంలోని ధర్మాపురం, గొరిగెనూరు గ్రామాలలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు గొరిగెనూరులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంను, ధర్మాపురంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ఆర్టీసీ చైర్మన్ ప్రత్యేక పూజలు



మల్లికార్జునరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

కమలాపురం : మండలంలోని కొండాయపల్లిలో నూతనంగా వెలసిన సీతారామాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించారు. ఈ ప్రతిష్టా మహోత్సవాలకు హాజరు కాలేని ఆయన మంగళవారం ఆలయానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మహేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలు మల్లికార్జునరెడ్డిని శాలువ కప్పి, పూలమాల, మెమెంటోలతో సత్కరించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

వేంపల్లె : విద్యార్థులను బడులకు పంపడంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని హెడ్మాస్టర్ నారాయణమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు అనేక రకాలు సహాయ సహకారాలు అందిస్తోందని.. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ మెంబర్లు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌సీడీఎల్ కార్యక్రమం పరిశీలన

లింగాల : మండలంలో ఎల్‌సీడీఎల్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటా లెప్రసీ (కుష్టువ్యాధి)పై సర్వే నిర్వహిస్తున్నారు. ఇంటిల్లిపాదికి శరీరంపై స్పర్శలేని తెల్ల, నల్ల పొడలు ఉన్నాయా అని విచారిస్తున్నారు. పొడలు ఉన్న వారికి అవి స్పర్శ ఉన్నది లేనిది పరీక్షిస్తున్నారు. ఈ సర్వేపై మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి, డీపీ ఎంఓ పీవీ రమణారెడ్డిలు మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే తనిఖీ

లింగాల : మండలంలోని కామసముద్రం సచివాలయ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఈ సర్వేపై ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణలు తనిఖీలు నిర్వహించారు. సచివాలయ పరిధిలోని కామసముద్రం, ఇంటి ఓబాయపల్లె, కమ్మవారిపల్లె, రామాపురం, దొండ్లవాగు గ్రామాల్లో జగనన్న సురక్ష బృందాలు ఇంటింటా సర్వే నిర్వహిస్తూ వారి సమస్యలను నమోదు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో బృందాలకు ఎంపీడీఓ, తహసీల్దార్‌లు తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వలంటీర్లు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలుపై చర్యలు తీసుకోవాలి

పులివెందుల టౌన్ : పట్టణంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉన్న ఎంఈఓ వీరారెడ్డికి బీసీ ఫెడరేషన్ సంస్థ ప్రతినిధులు వినతిపత్రం అందించి మాట్లాడారు.

రేపు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : బక్రీద్, ఏకాదశి పండుగలను పురస్కరించుకుని పట్టణంలోని శిల్పారామంలో గురువారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామ ఏఓ సుధాకర్ తెలిపారు. డ్యాన్స్ అకాడమి చిన్నారులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ఎగువపల్లెలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రంపతాడు గ్రామ సచివాలయం పరిధిలోని ఎగువపల్లె, రంపతాడు, జగంరెడ్డిపల్లె, కొత్తపల్లె, మమ్ముసిద్దుపల్లె గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలిసి నిర్వహించి మాట్లాడారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాడన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే అక్కడే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల సక్రమంగా అందుతున్నాయాలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని సత్వరం వాటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎగువపల్లె, జగంరెడ్డిపల్లె గ్రామాల్లో సీసీరోడ్లు, విద్యుత్‌లైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు.అలాగే జగంరెడ్డి గ్రామంలో పాడుబడ్డ బావులను పూడ్చివేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, విజయ, వెంకటసుబ్బారెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సర్పంచ్ సంజీవ్, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిర్మించిన నిర్మాణాలను తొలగించుకోవాలి



సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డుపై నిర్మించిన ఇంటి నిర్మాణాలను వెంటనే తొలగించుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఇళ్ల యజమానులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని జెండామాను వీధి, శ్రీనివాస హాలు వెనుక ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణ, ఇంటింటికి చెత్త సేకరణ వాహనాలు సమయానికి వస్తున్నాయా, లేదా అని అక్కడి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి మెటికలను అరుగులను రోడ్డుపై నిర్మించడం జరిగిందని.. వాటిని వెంటనే తొలగించుకోవాలని.. లేకపోతే మేమే తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• సచివాలయం ప్రారంభం

పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా మంగళవారం వేంపల్లెలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, చిత్రంలో వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి తదితరులు



పాడి పశువుల గ్రౌండింగ్‌పైన దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : పాడి పశువుల గ్రౌండింగ్‌పైన ప్రధానంగా దృష్టి పెట్టాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్‌తో కలిసి ఆయన నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, ఏపీఎంలు, సీసీలు, డెయిరీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాల సేకరణ పెంపు జరగాలంటే కచ్చితంగా పాడి పశువుల గ్రౌండింగ్ తప్పనిసరి అన్నారు. అమూల్ పాల రేటు పెంచిన విషయం పాడి పశువుల లబ్ధిదారులకు, ప్రజలకు తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు పెట్టి రైతులను ప్రోత్సహించాలన్నారు. అలాగే పాత బీఎంసీలు, కొత్త బీఎంసీల ఆధారంగా మ్యాపింగ్‌లు శుక్రవారం నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. యువతకు ప్రోత్సాహకంగా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి మినీ డెయిరీలను ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ ఓబుళరెడ్డి, డీసీఓ సుభాషిణి, ఏరియా కో ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, ఎంపీడీఓలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమకే గర్వకారణం డీకే బాబు



డీకే చదువుల బాబును సన్మానిస్తున్న వెంకటయ్య

కమలాపురం : సుప్రసిద్ధ బాలసాహితీవేత్త డీకే చదువుల బాబుకు 2023కి గాను బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం రాయలసీమకే గర్వకారణం అని అధికార భాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని పెద్దచెప్పలి హైస్కూల్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌ఎం ఓబులరెడ్డి అధ్యక్షతన చదువుల బాబును ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ మొట్ట మొదటి సారి రాయలసీమకు బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం రావడం గర్వకారణం అన్నారు. చదువుల బాబు రాసిన వజ్రాల వాన బాలల కథ సంపుటికి ఈ పురస్కారం లభించిందన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన చదువుల బాబుకు అలాగే జిలానీ బాషాకు కూడా సాహిత్య విమర్శకు సంబంధించి కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారం రావడం జిల్లా సాహితి మిత్రులందరికి దక్కిన గౌరవం అన్నారు. చదువుల బాబు శ్రమజీవి అని నిరంతరం కష్టపడేతత్వం ఉండటం వల్లనే ఇంతటి గొప్ప గౌరవాన్ని సాధించారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డి, జీవీ సాయిప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వీపర్ నియామకంపై వివాదం

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని కుప్పూరువారిపల్లె ఎంపీపీ పాఠశాలలో స్వీపర్ నియామకంపై వివాదం చోటు చేసుకుంది. స్థానికులు, అధికారుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ పాఠశాలలో గత కొన్నేళ్లుగా మాధవి అనే మహిళ ఆయాగా పని చేస్తోంది. అయితే ఇటీవల ఆమె పాఠశాలలో లేని కారణంగా కొత్త ఆయాను నియమించాలని మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. 22 మంది విద్యార్థులు ఉండగా 11 మంది తల్లిదండ్రులు సమావేశానికి వచ్చారు. వారంతా కొత్త ఆయాగా నియమితులవుతున్న లక్ష్మీదేవికి మద్దతు ఇవ్వడంతో ఆమెనే ఆయాగా హెచ్‌ఎం శ్రీనివాసులు ఎంపిక చేశారు. ఈ విషయం తెలుసుకున్న పాత ఆయా మాధవి తన మద్దతుదారులతో అక్కడికి చేరుకుని ఎవరికి సమాచారం ఇవ్వకుండా కొత్త ఆయాను ఎలా నియమిస్తారని వాగ్వివాదానికి దిగింది. దీంతో పాఠశాల వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చిన్నపెద్దయ్య అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపించి వేశారు. కాగా మాధవి మద్దతు దారులు ఎంఆర్‌సీకి చేరుకుని ఆయా నియామకం సరైన పద్ధతిలో ఎంపిక చేయలేదని మరోసారి ఎంపిక చేయాలని ఎంఈఓ-2 సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎంఈఓ జాఫర్‌సాదిక్‌ను వివరణ కోరగా మాధవి మద్దతు దారులు ఇచ్చిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ మాల కొండయ్య

సింహాద్రిపురం : డ్వాక్రా మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని డీఆర్డీఏ పీడీ మాలకొండయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఆయన వీఓఏలు, సీసీలుతో రివ్యూ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. సంఘాలలోని ప్రతి మహిళకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలని, పీఎంఈజీపీ, ఫుడ్ ప్రాసెసింగ్ స్కీమ్స్ ఉపయోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పాడి పశువుల కొనుగోలుకు అవసరమైన రుణాన్ని స్త్రీనిధి, సీఐఎఫ్, బ్యాంకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. అలాగే ఇళ్లపై అవగాహన కల్పించి అందరూ ఇళ్లు కట్టుకునే విధంగా ప్రోత్సహించి రూ.35 వేల రుణ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మంజునాథ్, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వేముల : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి తెలిపారు. మండలంలోని వేల్పుల రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఏడీఏ అశోక్‌రెడ్డితో కలిసి ఆయన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు వ్యవసాయ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల ద్వారా చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొర్రలు, కంది విత్తనాలను ఉచితంగా అందిస్తోందన్నారు. అంతేకాక తెల్ల పొటాష్, డీఏపీ, యూరియా వంటి ఎరువులు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఈ సందర్భంగా ఆయన రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ చెన్నారెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎత్తిపోతల పథకం ప్రారంభం

ముద్దనూరు : గండికోట జలాశయం నుంచి గాలేరు–నగరి ప్రధాన కాలువ ద్వారా మండలంలోని 6 చెరువులకు నీరందించే ఎత్తిపోతల పథకాన్ని బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సుమారు రూ.6.45 కోట్లతో చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకం ద్వారా 2500 ఎకరాలకు సాగునీరందనుంది. మండలంలోని కాంట్లేపల్లె గ్రామ సమీపంలోని జీఎన్‌ఎస్ఎస్ కాలువ నుంచి మోటర్ల ద్వారా పూల చెరువు, ఆకుతోటపల్లె, ఉప్పలూరులోని రెండు చెరువులు, వేల్పుచెర్ల, పెనికలపాడు చెరువులను నీటితో నింపనున్నారు. ఈ ఏడాది జనవరి నెలలో ఎంపీ, ఎమ్మెల్యే ఉప్పలూరు చెరువును పరిశీలించి 6 నెలల్లో ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసి చెరువులకు నీరందిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ‘జగనన్న సురక్ష’



కమలాపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏపీపీఎస్‌సీ బోర్డు మెంబర్ సుధాకర్‌రెడ్డి

కమలాపురం : దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఏపీపీఎస్‌సీ బోర్డు మెంబర్ నిమ్మకాలయ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురం వార్డు-1 సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి లబ్ధిదారులతో మాట్లాడారు. మీకు అర్హత ఉండి ఏవైన పథకాలు రానివి ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హత ఉండి పథకాలు రానివారికి ఆగస్టు 1వ తేదీ నుంచి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అలాగే మాకు అన్ని పథకాలు వస్తున్నాయి... ఏమీ పెండింగ్ లేవు అనే వారితో సైతం సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందని వారుంటే గుర్తించి వారికి పథకాలు అందించడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నిఖిల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు అంబటి సురేష్, విశ్వనాథరెడ్డి, మోనార్క్, సుదర్శన్‌రెడ్డి, కుమార్, ఖాజాపీర్, షారుక్ ఖాన్, స్థానిక నాయకులు, గృహ సారధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా ప్రారంభించిన జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అనిమెల, మొయిళ్ల చెరువు సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి అవగాహనా కార్యక్రమం నిర్వమించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యే వారికి మరిన్ని సేవలు అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, జగనన్న సురక్ష పథకం మండల పరిశీలకుడు ఇదయత్, అనిమెల, మొయిళ్లచెరువు సర్పంచ్‌లు నరేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవాలి

చెన్నూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర హార్టికల్చర్ సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చెన్నూరు గ్రామ సచివాలయాలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని వలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు అవగాహన కల్పించారు. అలాగే చెన్నూరులో సచివాలయం-2, సచివాలయం-3తో పాటు మండలంలోని శివాలపల్లె సచివాలయంలో జగనన్న సురక్ష పై అక్కడి సచివాలయం కన్వీనర్లకు, వలంటీర్లకు, గృహసారథులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, మండల జెఏసీఎస్ కన్వీనర్ నిరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆర్‌ఎస్ఆర్, ఎర్రసాని మోహన్‌రెడ్డి, కొక్కిరాయపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విద్యుత్ శాఖ అధికారులు

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని వ్యవసాయ సర్వీస్ కొరకు దరఖాస్తు చేసుకున్న రైతులకు పది రోజుల్లోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందించేందుకు విద్యుత్ అధికారులు అందుబాటులో ఉంటున్నారని ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిసేవ్య నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు వ్యవసాయ సర్వీసుల కోసం అధికారుల చుట్టూ తిరగకుండా, ఎటువంటి అవినీతికి తావు లేకుండా నియోజకవర్గ రైతులకు విద్యుత్ శాఖ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారన్నారు. రైతులకు వ్యవసాయ సర్వీసులు మంజూరు చేయడంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విద్యుత్ శాఖ ఎండీ సంతోషరావు బాధ్యతలు తీసుకున్న అనంతరం విద్యుత్ పరికరాల కొనుగోలు విషయంలోనూ సరఫరాలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 5 మంది జూదరులను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.8400 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌ఓ నాగరాజు తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్యుడు వినయ్‌కుమార్‌రెడ్డి చేపడుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్లలో డీడీటీ పిచికారి

లింగాల : స్థానిక ఎస్సీ, బీసీ ప్రభుత్వ వసతి గృహాలలో దోమల నివారణకు ముందస్తు జాగ్రత్తగా మంగళవారం డీడీటీ పిచికారి చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య మాట్లాడుతూ అన్ని హాస్టళ్లలో విద్యార్థులు దోమ కాటుకు గురి కాకుండా డీడీటీ పిచికారి చేస్తున్నామన్నారు. దోమ తెరలు వాడాలన్నారు. విద్యార్థులకు జ్వరాలు వచ్చినట్లయితే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

వేంపల్లె : పట్టణంలో ఉన్న యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు బీఎస్ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూలు నిర్వాహకులు బి.నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 25 ఏళ్లలోపు గల యువకులకు సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ఫ్రెండ్స్ గ్రూప్ సహకారంతో 30 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 15 రోజులపాటు థియరీ క్లాసులు, 15 రోజులపాటు ప్రాక్టికల్ నిర్వహించబడును. ఆసక్తి గల యువకులు నాలుగు ఫొటోలు, పదవ తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను జులై 5వ తేదీలోపు తీసుకరావాలన్నారు. మరిన్ని వివరాలకు 8247792950 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

అధికారులూ.. చర్యలు చేపట్టండి



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని పలు వీధులలో కుక్కలు, పందులను నుంచి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో ఇటీవల పందులు అధికంగా తిరుగుతున్నాయని అందులో శాంతినగర్ కాలనీలో, ప్రకాశ్‌నగర్ కాలనీలలో సంచరిస్తున్నాయని ఫిర్యాదలు వస్తున్నాయన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్‌ను ఆయన ఆదేశించారు. సమావేశంలో కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ, ఆర్‌ఓ గంగిరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్‌లు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ వీరారెడ్డి

పులివెందుల టౌన్ : తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు బాధ్యతగా పంపించాలని ఎంఈఓ వీరారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి తల్లిదండ్రులు వారి వారి పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని.. సాయంత్రంవేళలో ఇంటి వద్ద పిల్లలకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌లను చేయించాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శైలజ, హెడ్మాస్టర్ గంగిరెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్



దివ్యాంగులకు నిత్యావసర సరుకుల ప్యాకెట్‌ను అందిస్తున్న రూరల్ సీఐ బాల మద్దిలేటి

పులివెందుల టౌన్ : దివ్యాంగుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ అని పులివెందుల రూరల్ సీఐ బాలమద్దిలేటి అన్నారు. మంగళవారం వికలాంగుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో కడపకు చెందిన సంఘ మిత్ర స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, శిల్పారామ రాష్ట్ర స్పెషలాఫీసర్ మునిరాజు, తొండూరు ఎస్‌ఐ హనుమంతు, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తనిఖీ



పులివెందుల కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ డాక్టర్ పి.బాబు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను మంగళవారం ఆర్‌జేడీ డాక్టర్ పి.బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలోని తరగతి గదులను, వసతులను పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులుకు కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అనంతరం కళాశాలలోని రికార్డులను పరిశీలించి వాటిని నిర్వహించే విధానాన్ని తెలియజేశారు. కళాశాల విద్యార్థినులకు నాణ్యమైన విద్యను బోధించాలని.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థినులు కళాశాలలో చేరేలా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర్, పీఆర్‌ఓ బాలనారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఆర్‌జేడీ డాక్టర్ పి.బాబు ఆకస్మికంగా తనిఖీ చేసి అధ్యాపక బృందంతో సమావేశమై మాట్లాడారు. ఆధునిక కాలంలో ఉన్నత విద్య అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని.. నూతన విద్యా విధానం అమలులోనికి వచ్చిన తర్వాత అధ్యాపకుల బోధన పద్ధతులు, విద్యార్థులతో అనుసరించాల్సిన విధానం పూర్తిగా మారిందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు కళాశాలలోని వివిధ విభాగాల గురించి ఆయనకు వివరించారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, కళాశాల అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.